## క్లుప్తంగా

### భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఖాజీపేట : గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తహసీల్దారు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా తుడుమలదిన్నె గ్రామంలో అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. రైతుల నుంచి భూ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వినతులను వేగంగా పరిశీలించి భూ సర్వే చేసి పరిష్కరిస్తామని తెలిపారు.

### కష్టపడి చదవాలి



వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

కాశినాయన : విద్యార్థులు కష్టపడి చదవాలని బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. మండలంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతి గృహాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ సరైన వసతులు సమకూరుతున్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. 30 ఏళ్లుగా ఎస్సీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో ఉందని వారు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వంద మందికి ఒక బాత్‌రూమ్, స్నానపుగది ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం సగిలేరు ఒడ్డున వివేకానంద సేవాశ్రమాన్ని సందర్శించి వృద్ధులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామతులసి, వార్డెన్లు, అధికారులు పాల్గొన్నారు.

### 22న మల్లేపల్లెలో భూ రీ సర్వేపై గ్రామసభ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లెలో ఈ నెల 22న మంగళవారం ఉదయం పది గంటలకు భూ రీ సర్వేపై గ్రామ సభ ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. భూముల సమస్యలు ఉంటే రీసర్వే కోరుతూ వినతిపత్రాలు సమర్పించాలని వారు కోరారు.

### నీటి సమస్య పరిష్కరిస్తాం



కుమ్మరి కొట్టాలలో నీటి సమస్యపై మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : ప్రజలకు ఇబ్బంది కలగకుండా నీటి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున అన్నారు. శనివారం ఉదయం కమిషనర్ కుమ్మరికొట్టాల ప్రాంతంలో ఆయన పర్యటించారు. తమకు తాగునీరు సక్రమంగా అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం గోపీ రైస్‌మిల్, మోడంపల్లె, బుగ్రసాధు మఠం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, బుగ్రసాధు మఠంలో కాల్వలు లేని ప్రాంతాల్లో అంచనాలు తయారుచేసి నివేదిక పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

### ఎమ్మెల్సీ నివాళి



వెంకటసుబ్బయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

గోపవరం : మండలంలోని గోపవరం సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ భర్త తోడేటి వెంకటసుబ్బయ్య శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి శనివారం వెంకట సుబ్బయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సూరాబీమారెడ్డి రెండు రోజుల క్రితం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ బద్వేల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్ రామిరెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, ఎంపీటీసీ సరస్వతి, పార్టీ నాయకులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత బాలికకు సహాయ సహకారాలు అందిస్తాం

కడప ఎడ్యుకేషన్ : గోపవరం మండలం చెంచురి ఫ్లైవుడ్ ఫ్యాక్టరీ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ బాలుడు నిప్పంటించడంతో గాయాల పాలైన బాలికకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మహిళా సాధికారిత అధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు దస్తగిరమ్మను శనివారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున బాలికకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. రిమ్స్‌లో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్వేలు సీడీపీఓ, సిబ్బందిపాల్గొన్నారు.

# రహదారి నిర్మాణంతో పల్లెలకు మహర్దశ

- ఆరు గ్రామాల మీదుగా 15 కిలోమీటర్ల పనులు
- గత ప్రభుత్వ హయాంలో రూ.9 కోట్లు మంజూరు



నంగనూరుపల్లె-రేగుళ్లపల్లె మధ్యలో నిర్మిస్తున్న రోడ్డు

ప్రొద్దుటూరు : నూతన రహదారుల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. మండలాలు, పట్టణాల నుంచి లింకు రోడ్ల నిర్మాణం పూర్తయితే గ్రామాల మధ్య రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుంది. ఈ పరిధిలో కొంత వరకు గ్రావెల్ రోడ్లు, మరికొంత తారు రోడ్లు ఉండగా, అసలు రోడ్డు లేని ప్రాంతాలు చాలా ఉన్నాయి.

**గత ప్రభుత్వంలో రోడ్డు మంజూరు**

ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు, చెన్నమరాజుపల్లె గ్రామాల మధ్య రోడ్డు నిర్మించేందుకు రూ.9కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఈ నిధులు మంజూరు చేసింది. ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. కల్లూరు, రేగుళ్లపల్లె, నంగనూరుపల్లె, మీనాపురం, కొత్తపల్లె మీదుగా చెన్నమరాజుపల్లె వరకూ రోడ్డు నిర్మాణం జరగనుంది. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామీణులకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. ఈ మార్గంలో పంట ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు సులవవుతుంది.

**రోడ్డు నిర్మాణంతో ఉపయోగం**



నూతనంగా నిర్మిస్తున్న కల్లూరు, చెన్నమరాజుపల్లె మధ్య రోడ్డు నిర్మిస్తే మా గ్రామాలకు ఎంతో ఉపయోగం. చాలా ఏళ్లుగా రోడ్డు దెబ్బతినడంతో పంట ఉత్పత్తులు, ఇతరత్రా పనులకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. చాలా కాలం తర్వాత కొత్తగా రోడ్డు మంజూరైంది. వేగంగా పనులు పూర్తి చేయాలి.

- శావలి వెంకటరమణ, నంగనూరుపల్లె, ప్రొద్దుటూరు మండలం

**ఇంత వరకు తారు రోడ్డు లేదు**

ఏళ్లుగా మా ఇబ్బందులు చూస్తున్న ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రొద్దుటూరు నుంచి సరైన రోడ్డు లేక మా గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. రేగుళ్లపల్లె, కల్లూరు గ్రామాలకు అసలు ఇంత వరకూ తారు రోడ్డు లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి.

- సత్యనారాయణ, రేగుళ్లపల్లె, ప్రొద్దుటూరు మండలం

# ఉపాధి నిధులతో సీసీ రహదారుల నిర్మాణం



చాపాడు: లక్ష్మీపేటలో సీసీ దారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ వీర కిశోర్

చాపాడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీఓ వీరకిశోర్ పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు, బద్రిపల్లె, లక్ష్మీపేట, కుచ్చుపాప, వెదురూరు పంచాయతీలలో సీసీ దారుల నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బద్రిపల్లెలో రూ.9.70 లక్షలు, కుచ్చుపాపలో రూ.4 లక్షలు, లక్ష్మీపేటలో రూ.6.50 లక్షలు, వెదురూరులో రూ.20 లక్షలు, చియ్యపాడులో రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మానం చేపడుతున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంచేయాలని ఇంజినీర్లు పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, టీడీపీ నాయకులు నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, శివప్రసాద్, శివరామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రమణారెడ్డి, ఇంద్ర, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మండల అభివృద్ధికి సహకారం**

గ్రామ పంచాయతీల అభివృద్ధికి వార్డు సభ్యులు సహకరించాలని ఎంపీడీఓ ఎ.వీర కిశోర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు శనివారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలక బాధ్యత అన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షకులు దేవేంద్రరెడ్డి, జానకీరామ్, సుబ్బరాయుడు పలు అంశాలపై ప్రజా ప్రతనిధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

**ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి**



కోడిగుడ్లపాడులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విజయమ్మ, రితీష్‌రెడ్డి

కాశినాయన : జాతీయ ఉపాధి హామీ పనులతో గ్రామాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామంలో రూ.9 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రూ.1.75 కోట్ల నిధులతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మినీ గోకులాలు మండలానికి మంజూరయ్యాయని, ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలగురయ్య, టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, బంగారుగురివిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా నియంత్రణకు కృషి



వాక్ ఫర్ ఫ్రీడమ్‌ను నిర్వహిస్తున్న విద్యార్థులు



పుట్టపర్తి సర్కిల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

మైదుకూరు : మానవ అక్రమ రవాణా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. ఆస్ట్రేలియా ఏ-21, ది మూమెంట్ ఇండియా, మదనపల్లె గ్రామ జ్యోతి సొసైటీ సౌజన్యంతో స్థానిక అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన పసికందు నుంచి వయో వృద్ధుల వరకు అక్రమ రవాణాకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, ఎవరైనా మానవ అక్రమ రవాణాకు గురైతే 1098, 181 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం చేపట్టిన వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని సీడీపీఓ శ్రీదేవి జెండా ఊపి ప్రారంభించారు. నల్లటి టీ షర్టులు ధరించి ప్లకార్డులు చేతపట్టి 200 మంది విద్యార్థులు 'నిశ్శబ్ద నడక' నిర్వహించారు. శివశంకర్, కిన్నెర ప్రసన్న కుమార్, ఇమ్మిడిశెట్టి సతీష్ బాబు, సుబ్బు, విజయ్, గంగాభవాని పాల్గొన్నారు.

**అక్రమ రవాణాను అరికట్టాలి**

ప్రొద్దుటూరు కల్చరల్ : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఏఎస్ఐ రాజారమణి సూచించారు. పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై ప్రజలను చైతన్య పరిచేందుకు స్థానిక విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలతోపాటు బాలికలు, పురుషుల రవాణా జరుగుతోందని, వాటిని నియంత్రించేందుకు పోలీసు శాఖ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. మానవ రవాణా విషయం తెలిసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బైసాని సత్యనారాయణ, శూలం లక్ష్మీదేవి, మధుసూదన్‌రెడ్డి, సంధ్య, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

చాపాడు : వరుస నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మండలంలోని నిందితులు, నేరస్తుల ఫొటోలను పోలీస్ స్టేషన్ నోటీసు బోర్డులో ఉంచినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలు రకాల నేరాలకు పాల్పడుతూ ప్రజలు, ప్రభుత్వానికి ఇబ్బందులు కలుగజేస్తున్న నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగేలా పోస్టర్లను ఏర్పాటు చేశామని ఎస్ఐ చెప్పారు.

### భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయండి

బద్వేలు అర్బన్ : పట్టణంలో ప్రభుత్వ స్థలాల కబ్జాకు అడ్డుకట్ట వేయాలని బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్‌కు మున్సిపల్ చైర్మెన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి విన్నవించారు. ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. పురపాలక సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆర్డీఓకు తెలిపారు. అనంతరం ఆర్డీఓను శాలువాతో సత్కరించారు.

### విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిని శిక్షించాలి

బద్వేలు అర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థిని దస్తగిరమ్మపై పెట్రోలు పోసి నిప్పంటించిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ చైర్మన్ కాసల కోనయ్య ఒ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ బాలికలపై అరాచకాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు పాఠశాలలు, కళాశాలల వద్ద నిఘా ఉంచి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చదువుతో పాటు విలువలు నేర్పాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు.

### అందరికీ సమాచారం ఇస్తాం

అట్లూరు: సమాచారం హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ నిర్ణీత సమయంలోగా సమాచారం ఇస్తామని మండల వ్యవసాయాధికారి జి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం -2005పై శనివారం మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్6, 7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాలు, సిబ్బంది పాల్గొన్నారు.

### జన సురక్షతో అందరికీ బీమా

అట్లూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్షతో బీమా సౌకర్యం పొందవచ్చునని జిల్లా ఎల్‌డీఎం జనార్దన్ పేర్కొన్నారు. మండలంలోని కుంభగిరి గ్రామంలో ప్రధాన మంత్రి సురక్షా బీమా, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన కార్యక్రమాలపై శనివారం బ్యాంకు సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. జనార్దన్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో ప్రతి ఒక్కరికీ బీమా ఆవశ్యకత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అట్లూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎస్.దుశ్యంత్ కుమార్, ఫీల్డ్ ఫిషర్ వి.రాయుడు, నారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.

### ముంపు బాధితులకు అన్యాయం

అట్లూరు: సోమశిల ముంపు గ్రామాల వాసులకు తగిన న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని డిమాండ్ చేశారు. అట్లూరు విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు కింద అట్లూరు మండలలోని ఆరు పంచాయితీ గ్రామాలు, ఒంటిమిట్ట, నందలూరు, పెనగలూరు మండలాల్లో మరిన్ని గ్రామాలు ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. అర్హతను బట్టి ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఖాళీ చేయించారని, నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలివ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# వంట ఏజెన్సీ దారుల సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల : సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ దారుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సవ్యంగా సాగాలంటే వంట ఏజెన్సీలకు గౌరవ వేతనం రూ.6 వేలకు పెంచాలన్నారు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ. 10, ప్రాథమికోన్నత విద్యార్థులకు రూ.17 చెల్లించాలన్నారు. బియ్యంలో నాణ్యత లేనందున చిన్నారులు తినలేకున్నారని, నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని కోరారు. మెనూ ఆకర్షణీయంగా ఉంటే సరిపోదని, ధరలకు అనుగుణంగా నగదు ఇవ్వకపోతే రుచికరమైన, నాణ్యమైన భోజనం ఎలా అందించగలరో ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు చంద్రహాసరెడ్డి, చంద్రశేఖర్, బాలరాజు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న మాలకొండయ్య

మైదుకూరు : మాదక ద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలని నెహ్రూ యువ కేంద్రం, వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్టు నిపుణుడు మాలకొండయ్య సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ పొగాకు, మాదక ద్రవ్యాల బారిన పడి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. వాటితో దీర్ఘకాలిక అనారోగ్యం, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక రుగ్మతలు కలుగుతాయని, విద్యార్థులు మేథో వికాసాన్ని దెబ్బతీసి, భావోద్వేగ నియంత్రణ శక్తిని తగ్గిస్తాయని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి యువకులు సమాజానికి, తమ కుటుంబ సభ్యులకు మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలను వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.సుభాన్‌సాహెబ్, అధ్యాపకులు అయ్యవారురెడ్డి, నరసింహారావు, నవనీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

### నట్టల నివారణా మందుల పంపిణీ

బ్రహ్మంగారిమఠం : విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తతో శనివారం నట్టల నివారణ మం పంపిణీ చేస్తున్నట్లు మండల పశు వైద్యుడు నిత్యానంద్ తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు మందులు వేస్తారని తెలిపారు. గొర్రెలు, మేకల కాపరులు సిబ్బందితో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### హెల్త్ క్లినిక్ తనిఖీ

బి.కోడూరు: కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని మేకవారిపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఎస్ఓ రమేష్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడుతూ బాలికలకు కౌమార దశలో రక్త పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు, డీపీఓ కుమార్ నారాయణ, అరుణకుమారి, జాకబ్, రాజశేఖర్, నాగమణి, పుష్పాంజలి, జాన్‌విలియం, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమోన్మాది దాడిలో గాయపడిన విద్యార్థినికి అండ

- జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థినికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించడం వల్ల తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం రాత్రి వారు పరామర్శించారు. అమ్మాయి కుటుంబ సభ్యులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కఠిన శిక్ష పడాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు దిశ చట్టం ద్వారా రక్షణ కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దిశ చట్టాన్ని రద్దు చేసిందని, ఆ యాప్ కూడా మనుగడలో లేదన్నారు. కనీసం బాధితురాలిని పరామర్శించేందుకు కూడా కూటమి నేతలకు మనసు రాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, తోటక్రిష్ణ, దత్తసాయి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే పల్లె పండగ



త్రిపురవరంలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు



బ్రాహ్మణపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖాజీపేట: పల్లెల్లో సమస్యలను పరిష్కరించేందుకే పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివిజా సంపతి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా తవ్వారిల్లె, ఏటూరు, త్రిపురవరం, మిడుతూరు గ్రామాల్లో సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, బొగ్గుల చంద్రఓబుళరెడ్డి, శ్రీరాముల యాదవ్, చంద్రశేఖర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డుకు భూమిపూజ**

గోపవరం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ జయరామిరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీఓ రామనాథరెడ్డి శనివారం భూమిపూజ జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో దాదాపు రూ.1.26 కోట్లతో 22 పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, శ్రీహరి, విజయమ్మ, మోశ, గోపిదేశి కొండయ్య, లగ్గారమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

ప్రొద్దుటూరు: భూ సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పాటుచేసిన రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్ తెలిపారు. కొత్తపల్లె సచివాలయం-3లో శనివారం జరిగిన భూ సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల కోసం రీసర్వే చేయించిందని, అందులో ఏవైనా పొరపాట్లు ఉన్నా, రైతులు నష్టపోయినా వెంటనే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివచంద్రారెడ్డి, కడప సర్వే ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, రవి, సాయి సుమ, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

**ఇనాం భూములను క్రమబద్ధీకరించాలి**

రాజుపాళెం : రైతులకు ఇబ్బందిగా మారిన సర్వీస్ ఇనాం భూములను క్రమబద్ధీకరించాలని సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి కోరారు. మండలంలోని గాదెగూడూరు సచివాలయంలో శనివారం జరిగిన గ్రామసభలో డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ రీ సర్వే తర్వాత రైతుల వన్‌బీ ఖాతాలో సర్వీస్ ఇనాం భూమి అని నమోదు కావడంతో భూములు రిజిష్టర్ కావడం లేదన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సతీష్, హుసేన్‌రెడ్డి, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

# తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని పలు దుకాణాల్లో శనివారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తూకం రాళ్లు, త్రాసులు, మీటర్ బద్దలను పరిశీలించి.. కాలపరిమితి దాటిన కాటాలకు అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రతి వ్యాపారి నిబంధనలు పాటించాలని, తూకం రాళ్లకు ముద్ర వేయించు కోవాలని ఆయన ఆదేశించారు.

ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేయరాదని, వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

చాపాడు: రహదారి పక్కన దుకాణాల ఎదుట ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్నపెద్దయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై గుంపులు గుంపులుగా వాహనాలు నిలపరాదని, టీ షాపులు, వివిధ దుకాణాల యజమానులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.